ప్రజాశక్తి
సోమవారం 2 జూన్ 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆవ సహజత్వం కోల్పోనుందా ?

- త్వరలో అటవీశాఖ స్వాధీనంలోకి రాక
- పర్యాటకంగా అభివృద్ధి చేస్తామంటున్న అధికారులు
- ఆయకట్టుపై ప్రభావం
- మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, మునగపాక విలేకరి

కొండకర్ల ఆవ తన సహజత్వాన్ని కోల్పోనుందా ? అంటే అవుననే సమాధానమే పలువురి నుంచి వినిపిస్తోంది. ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 కింద కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ఆవను ప్రకటించడానికి గత ప్రభుత్వంలోనే పునాదిపడింది. అయితే, అటవీ శాఖాధికారులు గతంలో పంపిన ప్రతిపాదనలకు ఈ ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ప్రస్తుతం నీటిపారుదల శాఖ ఆధీనంలోని ఆవను కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ప్రకటించాక ఆవ అటవీశాఖ స్వాధీనంలోకి వెళ్లనుంది. ఆవకు వచ్చే విదేశీ పక్షుల సంరక్షణ, విస్తీర్ణ పరిరక్షణ, చేపల వేట



కొండకర్ల ఆవ

వంటివాటిపై నియంత్రణాధికారం అటవీ శాఖకు దఖలుపడనుంది. దీనికిముందు పంచాయతీ తీర్మానం, సరిహద్దుల నిర్ణయం వంటి పనులు అధికారులు చేపడుతున్నారు.

దాదాపు 11 కిలోమీటర్లలో 2,654 ఎకరాల్లో ఆవ విస్తరించి ఉంది. దీనికింద అచ్యుతాపురం, మునగపాక మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లో 1502 ఎకరాల ఆయకట్టు ఉంది. కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ప్రకటించిన తరువాత అటవీ శాఖ పరిధిలోకి ఆవ వెళ్లినా తమ కార్యకలాపాలకు ఇబ్బందులు ఉండవని నీటిపారుదల శాఖాధికారులు చెబుతున్నారు. ఆకర్షణీయ పర్యాటక ప్రాంతంగా ఆవను అభివృద్ధి చేసే క్రమంలో ఆయకట్టుకు ఇచ్చే ప్రాధాన్యత తగ్గి, పర్యాటక నిర్వాహకుల పట్టు పెరగనుంది. ఆవ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు సమీప ప్రాంతాల మురుగునీరు ఆవలోకి వెళ్లకుండా, ఇతర నీటి వనరుల ప్రవాహాలపై ఆంక్షలు విధిస్తారన్న ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. అవకు వచ్చే నీటి ప్రవాహాలను దెబ్బతీసి నిబంధనలకు విరుద్ధంగా అనకాపల్లి ప్రాంతంలో లే అవుట్లు, నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో చారిత్రాత్మక ఆవ సహజత్వం భవిష్యత్తులో కోల్పోతుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ప్రకటించడానికి ముందు ఆవ నీటితో మిగతా 2లో..

విశాఖ నగరంలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న అభ్యర్థులు

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష ప్రశాంతం

12,491 మందికిగాను 11,338 మంది హాజరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం కానిస్టేబుల్ (సివిల్, ఎపిఎస్‌పి) అభ్యర్థులకు తలపెట్టిన మెయిన్స్ పరీక్ష విశాఖలో ప్రశాంతంగా ముగిసింది. విశాఖ నగర పరిధిలోని 27 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించగా 12,491 మంది అభ్యర్థులకుగాను 11,338 మంది (90.76 శాతం) హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను నగర ఇన్‌ఛార్జి పోలీస్ కమిషనర్, విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, డిసిపి 1 అజితా వేజెండ్ల, డిసిపి 2 డి.మేరీ ప్రశాంతి, డిసిపి (అడ్మిన్) కృష్ణకాంత్ పటేల్ సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో విటి హైస్కూల్లో 463 మంది అభ్యర్థులకుగాను 442 మంది, కాశ్యప్ డిగ్రీ కాలేజీలో 480 మందికిగాను 427 మంది, ప్రిజం కాలేజీలో 696 మందికిగాను 662 మంది హాజరయ్యారు. అభ్యర్థులకు అన్ని రకాల సౌకర్యాలూ కల్పించినట్టు నిర్వాహకులు తెలిపారు.

టిడ్కో గృహ లబ్ధిదారుల ఆందోళన

వార్త 4లో..

బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు పూర్తి

వార్త 8లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

వార్త 3లో..

విశాఖలో వేలిముద్ర వేసి సరుకులు తీసుకుంటున్న మహిళ

డిపోల్లో రేషన్ పంపిణీ ప్రారంభం

సరుకులు అందజేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు వార్త 7లో..

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉన్నాం

- విమ్స్‌లో ప్రత్యేక వార్డు సిద్ధం
- అందుబాటులో అన్ని రకాల మందులు, వైద్యులు
- 'ప్రజాశక్తి'తో స్టేట్ కోవిడ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాంబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ

ఎంతో మందిని బలిగొని, ఎన్నో కుటుంబాలను శోక సంద్రంలో ముంచిన కోవిడ్ పట్ల అప్రమత్తంగానే ఉన్నామని స్టేట్ కోవిడ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. సింగపూర్, హాంకాంగ్, థాయిలాండ్, చైనాలతో పాటు భారత్‌లోనూ నూతన వేరియంట్ జెఎన్-1 కోవిడ్ వైరస్ వేగం పెరగడంతో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలనూ అప్రమత్తం చేసిన నేపథ్యంలో పలు చర్యలు చేపట్టినట్టు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కోవిడ్ వైరస్ పాతదేనా లేక కొత్తగా ఏమైనా రూపాంతరం చెందిందా ?

ఇప్పటికే కోవిడ్ వైరస్ పలు విధాలుగా రూపాంతరం చెంది జెఎన్ 1 వేరియంట్‌లో.. సబ్ వేరియంట్లుగా ఎల్ఎఫ్ 7, ఎన్‌టి 1.8 రూపంలో విజృంభించడంతో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఆందోళన నెలకొంది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా గడిచిన మూడు వారాలుగా కోవిడ్ కేసులు పెరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలంతా ఆరోగ్యశాఖ, ఐసిఎంఆర్ సూచించిన విధంగా అప్రమత్తంగా ఉండటం వల్ల కోవిడ్‌ను నియంత్రించవచ్చు.

కొత్త వేరియంట్ లక్షణాలు ఏంటి ?

తాజాగా వెలుగులోకి వచ్చిన కోవిడ్ కొత్త వేరియంట్ సోకిన వారిలో ముఖ్యంగా జ్వరం, చలి, అలసట, తలనొప్పి, కండరాలు, శరీర నొప్పులు, ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్ళు నొప్పులు అధికంగా కనిపిస్తాయి. అంతేకాకుండా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆవ సహజత్వం కోల్పోనుందా ?

లబ్ధిపొందుతున్న ఆయకట్టు గ్రామాలు, ఆవ విస్తరించివున్న గ్రామాల్లో గ్రామ సభలు, పంచాయతీ తీర్మానాలు తీసుకొనే పనిలో అధికారులున్నారు. ఈ ప్రక్రియ పూర్తిచేసి నివేదిక పంపించనున్నారు. ఎంతోకాలంగా ఆవలో చేపలు పట్టుకొని మత్స్యకారులు బతుకుతున్నారు. చేపలు పట్టుకొనే వీరికి ఏ ఇబ్బందీ వుండదని అధికారులు చెబుతున్నా పర్యాటకంగా అభివృద్ధి జరిగాక చేపల పట్టుకునే అవకాశం నిర్వాహకులు ఇస్తారా ? అనే భయం వారిలో నెలకొంది. ఆవలో చేపల వేటకు ఆంక్షలు, అభ్యంతరం వుండవని లిఖితపూర్వక హామీ కలెక్టర్ నుంచి తీసుకోవాలని మత్స్యకారులు భావిస్తున్నారు.

కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ప్రకటించడానికి ముందే పర్యాటక అభివృద్ధిపై ప్రణాళిక తయారుచేసే పనిలో టూరిజం శాఖ ఉంది. పంచాయతీ, ఇరిగేషన్, ఫిషరీస్, టూరిజం శాఖాధిపతులతో కలెక్టర్ విజయకృష్ణన్ కొద్ది రోజుల క్రితం సమావేశం నిర్వహించి మార్గదర్శకం చేశారు. 2,654 ఎకరాల కొండకర్ల ఆవలో 500 ఎకరాలకుపైగా పెద్దలు ఆక్రమణలో వున్నాయి. శాశ్వత నిర్మాణాలు కూడా చేపట్టారు. ఆవ సర్వే, సరిహద్దులు గుర్తించే క్రమంలో ఆక్రమణలను తొలగిస్తారా ? లేదా ? అన్నది వేచిచూడాలి.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉన్నాం

ఈ వేరియంట్‌కు మానవ రోగ నిరోధక వ్యవస్థను ప్రతిఘటించే సామర్థ్యం ఉంది. అలాగే శరీరంలో తక్కువ సమయంలోనే ఇతర భాగాలకు వ్యాప్తి చెందుతుంది. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఇప్పటి వరకూ కోవిడ్ వైరస్ ఎన్ని వేరియంట్లు వచ్చినా వ్యాక్సిన్ తీసుకున్న వారిపై తీవ్రమైన ప్రభావం చూపిన దాఖలాలు ఎక్కడా కనిపించలేదు.

ఈ వైరస్ నుంచి రక్షించుకోవాలంటే ఏం చేయాలి ?

ప్రజలంతా కోవిడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. మాస్క్ ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించాలి. శానిటైజర్ వాడకం తప్పనిసరి. అత్యవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితిల్లోనూ దూర ప్రయాణాలకు వెళ్లకుండా ఉంటేనే మంచిది. అప్రమత్తంగా మెలగాలి.

ప్రభుత్వాలు ఎటువంటి సూచనలు జారీ చేశాయి ?

ఈ కొత్త వేరియంట్‌ను నియంత్రించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని సూచనలు జారీ చేశాయి. ముఖ్యంగా అన్ని ప్రాంతాల్లో ప్రార్థనా సమావేశాలు, గ్రూపు పార్టీలు, సమావేశాల్లో పాల్గొనడం తగ్గించాలి. రైల్వే, బస్ స్టేషన్లలో, విమానాశ్రయాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. రద్దీ ప్రాంతాల్లో మాస్క్ తప్పనిసరిగా వినియోగించాలి. ఆహారాన్ని తినే ముందు కచ్చితంగా చేతులను శుభ్రంగా కడుగుకోవాలి. కోవిడ్ లక్షణాలు ఉంటే తక్షణమే సమీపంలోని వైద్యుల సూచనల మేరకు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. కోవిడ్ ప్రభావిత దేశాలకు ప్రయాణించిన వ్యక్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి.

మాస్క్ నిరంతరం ధరించడం వల్ల రక్షణ పొందవచ్చా ?

కోవిడ్ వైరస్‌గానీ, కొత్త రకం ఎల్ఎఫ్ 7, ఎన్‌టి 1.8గానీ ఏదైనా సరే వ్యాప్తిని నిరోధించాలంటే ఉన్న ఏకైక మార్గం మాస్క్ ధరించడం. అయితే చాలా మంది మాస్క్ ధరించడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి.

కొత్త వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు విమ్స్ ఆసుపత్రిలో ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

ప్రస్తుతం విమ్స్ ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశాం. రోగులు లేకపోయినా ఆ వార్డులో సిబ్బందిని మూడు షిఫ్టుల్లో వేశాం.

తాజా వేరియంట్‌కు సంబంధించిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా ?

తాజా వేరియంట్‌కు సంబంధించిన వైద్యం అందించడం కోసం అన్ని రకాల మందులు, ఇంజక్షన్లు విమ్స్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. వైద్యులకు, సిబ్బందికి పిపిఇ కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు విమ్స్‌లో 450 పడకలకు సరఫరా చేయగలిగే సామర్థ్యంతో కూడిన రెండు ఆక్సిజన్ ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు విమ్స్‌లో 40 మంది వైద్యులు అందుబాటులో ఉండగా రెండు రోజుల క్రితం జరిగిన ఇంటర్వ్యూలో మరో 20 మంది వైద్యులను ఎంపిక చేశాం. వారంతా అందుబాటులోనే ఉన్నారు.

పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుదాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మన పర్యాటక ప్రాంతాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకుందాం అని కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ముకుందరావు పిలుపునిచ్చారు. ఆదివారం విశాఖపట్నం కైలాసగిరి కొండపై వియంఆర్‌డిఎ, సిఫా ట్రస్ట్, ఎస్ఆర్‌యు - జివిఎంసి, గ్రీన్

కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

అంబాసిడర్స్, గ్రీన్ క్లైమేట్‌టీమ్ ఎన్‌జిఒ నేతృత్వంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అని, మన జల వనరులను మనమే పరిరక్షించుకుందాం అని పిలుపునిచ్చారు.

సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశి ప్రభ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి అన్నారు. రాష్ట్రంలో పదివేల మంది గ్రీన్ అంబాసిడర్స్‌తో విభిన్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం లో వియంఆర్‌డిఎ అధికారిని సుజాత శివాని, కైలాసగిరి హార్టికల్చర్ ఆఫీసర్ రమేష్, ఎస్ఆర్‌యు జివిఎంసి ప్రాజెక్ట్ ఇంజనీర్ దాట్ల వివేకవర్మ, గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, గ్రీన్‌వాలంటీర్ కృష్ణకుమారి, ఎస్ఆర్‌యు జివిఎంసి ప్రతినిధి మంగరాజు, గ్రీన్ అంబాసిడర్స్ సంస్థ ప్రతినిధులు పుష్ప, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు పూర్తి

జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జూన్‌లో విద్యాసంస్థలు ప్రారంభం కావటంతో విద్యార్థులకు బస్సుపాసుల జారీకి ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ప్రజారవాణాఅధికారి అప్పలనాయుడు మీడియాకు తెలిపారు. నగరంలోని ద్వారకా బస్‌స్టేషను, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక ఎంవిపి బస్ స్టేషను, మధురవాడ, పెందుర్తి, కూర్మన్నపాలెం బస్‌పాసు కౌంటర్లు ఉదయం 8 నుండి రాత్రి 8 వరకూ పనిచేస్తాయన్నారు. విద్యార్థులు online.apsrtc-pass.in నందు వారి వివరాలు, ఫొటో నమోదు చేసుకుని, అప్లికేషన్ ఫారం ప్రింట్ తీసుకోవాలన్నారు. ఆ అప్లికేషన్‌పై తమ విద్యాసంస్థ ప్రిన్సిపాల్, హెచ్ఎంచే ధ్రువీకరణ చేయించి, సంబంధిత డిపో కార్యాలయానికి వెళ్లాలన్నారు. ఆ అప్లికేషన్‌కు ఆధార్, పదోతరగతి పాసయిన విద్యార్థులు అయితే టెన్త్ మార్కులిస్టు జెరాక్సు కాపీ జతపరచాలన్నారు. అప్లికేషన్ నందు ఫోన్ నెంబరు తప్పక రాయాలన్నారు. అన్ని విద్యా సంస్థలకు సూచనలు చేస్తూ,అడ్మిషన్ లిస్టు తరగతుల వారిగా ప్రిన్సిపాల్, హెచ్ఎంల సంతకాలతో సంబంధిత డిపో మేనేజరు ఆఫీసుకు అందజేయాలన్నారు. అలా చేయని విద్యాసంస్థలకు పాసులు జారీచేయబడవన్నారు. విద్యార్థుల జాబితా డిపోలకు అందజేయాల్సిన బాధ్యత విద్యాసంస్థలదేనన్నారు. 12 సంవత్సరాల లోపు బాలురు,18 సంవత్సరాల లోపు బాలికలు (10వ తరగతి వరకు) ఉచిత బస్సుపాస్, స్టూడెంటు జనరల్ బస్ పాస్ (ఇయర్లీ), స్టూడెంటు జనరల్ బస్ పాస్ (క్వార్టర్లీ), స్టూడెంటు జనరల్ బస్ పాస్ (మంత్లీ) ఉండేందుకు అర్హులు అన్నారు. విద్యార్థులు సంబంధిత డిపోలకు వెళ్ళి అప్లికేషను వెరిఫికేషను చేయించుకోవాలన్నారు.

చట్టాలను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పౌరప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. నంబాల కేశవరావు పెద్దకర్మ కార్యక్రమానికి పోలీసులు అవరోధం కల్పించడాన్ని ఖండిస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పౌర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం పేరుతో కార్పొరేట్ సమయం నడుస్తోందన్నారు. మోడీ, అమిత్‌షా రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాసి చట్టాలను తుంగలో తొక్కి దేశ ప్రజల సంపదను బడా కంపెనీ సంస్థలకు అప్పచెపుతున్నారని ఆరోపించారు. నంబాల కేశవరావు వంటి వారు ఆదివాసీ హక్కులను కాపాడడానికి ప్రయత్నం చేశారన్నారు. ఆదివాసీలు తమ భూభాగాలు కాపాడుకోవడానికి ఉద్యమంపై ఆధారపడుతున్నారన్నారు. అటువంటి ఆదివాసీలకు అడ్డుగా మావోయిస్టులు నిలబడ్డారని, రాజ్యాంగ హక్కులను ఉల్లంగించి దాడులు చేశారన్నారు. మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై దాడులకు పాల్పడిందని, ఆ సమయంలోనే నంబాల కేశవరావు వంటి వారిని కాల్చిచంపడం జరిగిందన్నారు. కుటుంబ సభ్యులు పెద్దకర్మ చేయడానికి పూనుకుంటే రాష్ట్రప్రభుత్వం ఆంక్షలు విధించటం దుర్మార్గం అన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపి అక్కడ ప్రజలకు రాజ్యాంగ హక్కులు అందేలా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, నేడు నంబాల కేశవరావు కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్ళి మృతదేహాన్ని తమకు అప్పగించాలని, న్యాయపోరాటం చేశారన్నారు. పోలీసు దళాలు వారిని హతమార్చిన తర్వాత గౌరవప్రదంగా వారికి అంత్యక్రియలు నిర్వహించుకునే హక్కు రక్తబంధువులకు ఇవ్వకపోవడం శోచనీయం అన్నారు. రక్తసంబంధీకులు రాలేదని ప్రభుత్వమే అన్యాయంగా అంత్యక్రియలు చేసిన పరిస్థితి చూసామన్నారు. కార్యక్రమంలో హూరా ప్రజాసంఘాలు వేదిక కన్వీనర్ పి.చంద్రశేఖర్, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, పడాల గోవింద్, ఈసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

క్రీడలతో క్రమశిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: క్రీడలతో వ్యక్తిలో క్రమశిక్షణ అలబడుతుందని తద్వారా వారు సమాజానికి అత్యుత్తమ మానవ వనరులుగా నిలుస్తారని పలువురు శాసనసభ్యులు అన్నారు. కళాభారతి ఆడిటోరియంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీగా ఎంపికైన డాక్టర్ డి. భగీరథకుమార్, ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన డి.ప్రసన్నకుమార్ సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గణబాబు, గౌతు శిరీష మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన భగీరథకుమార్, ప్రసన్నకుమార్ జాతీయ స్థాయిలో ఉన్నత పదవులను అందుకోవడం గర్వకారణమన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
E.P. No. 26/2020 in Dispute No. 423/2015

Between:
Mis. Margadarsi Chit Fund Private Limited. Seethammapeta Branch Visakhapatnam . . . Decree Holder
And:
Mr. K.Bhaskara Rao and 5 others . . . Judgment Debtors

PROCLAMATION OF SALE

Notice is hereby given that by an order of the Court named above, the property of 5th Jdr (i.e. **Pentapalli Dhana Lakshmi, W/o. Chandra Sekhar**) mentioned in the schedule hereunder has been ordered to be sold by public auction in satisfaction of the claim of the decree holder mentioned in the above E.P. for sum of Rs. 12,30.004/- (excluding publication charges and battas) up to the date of sale in the aforesaid dispute against the judgement debtor mentioned above.

Public are hereby informed that the sale will be by public auction and the same will be held between **10-30 A.M. to 05-00 PM on 19-06-2025** at public court ie., PRINCIPAL JUNIOR CIVIL JUDGE'S COURT, BHEEMUNIPATNAM.

At the sale the public are generally invited to bid, either personally or by duly authorised agent subject to terms and conditions to sale which may be had from the counsel for the decree holder whose address particulars are furnished here under.

SCHEDULE OF PROPERTY

The Immovable Property of Jdr 5: Visakhapatnam District, Madhurawada Sub Registry, Patta No. 585, Covered by Survey No. 4/3, built in 1418 Sft. (Including Common area) and 80 Sft. Car Parking vide Document No. 6385/ 2015, Flat No, 402, 3rd Floor in J.J. Mansion Apartment, Madhurawada Village, Visakhapatnam within the limits of Greater Visakhapatnam Municipal Corporation and bounded as follows

East : Open to Sky **West** : Common Corridore
South : Open to SKY **North** : Common Corridore
DHR's Value : **Rs. 30,00,000/-**
FA's Value : **Rs. 50,00,000/-**
JDR's Value : Not known as the Jdr did not furnish the same.

Visakhapatnam
Dt. 01-06-2025
P.MURALI GOPAL
Advocate, Visakhapatnam-530016.
Cell: 98483 20248

ప్రజా తీర్పుపై గౌరవం లేదా ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగన్ పరిపాలన నుండి విముక్తి పొందేందుకు ప్రజలు జూన్ 4న తీర్పు ఇచ్చారని విజయనగరం లోక్‌సభ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం జిల్లా టిడిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడు అద్భుతంగా జరిగిందని, ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతుందన్నారు. జూన్4న వెన్నుపోటు దినంగా ప్రకటించడం హేయమైనదన్నారు. ప్రజాతీర్పు అంటే మీకు గౌరవం లేదా అని వైసిపి నాయకులను ఉద్దేశించి ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును వెన్నుపోటు దినంగా ప్రకటించడంలోనే మీ వ్యక్తిత్వం తెలుస్తోందని ఎద్దేవా చేశారు. మహానాడు జరపకూడదని కలెక్టర్‌కు జగన్ రిప్రజెంటేటివ్ ఇచ్చారని వారి పార్టీ కార్యకలాపాలను తాము ఎప్పుడైనా అడ్డుకున్నామా అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు తమ్మినేని మోహన్ పాల్గొన్నారు.

నేడు డిసిసిబి చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా నియమితులైన జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఉడా లే అవుట్, మర్రిపాలెంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో కార్యక్రమం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

జనరల్ నోటీసు

నా క్లయింటు అయినటువంటి శ్రీ తియ్యగూర నరసారెడ్డి, తండ్రి సాంబిరెడ్డి, ప్రెసెంట్ నివాసం బోయపాడు గ్రామం, రాజయ్య పేట శివారు, నక్కపల్లి మండలం, అనకాపల్లి జిల్లా, నాకు ఇచ్చిన భోగట్టాపై నేను ఇచ్చుచున్న జనరల్ నోటీసు అంశములు... సదరు నా క్లయింటుకు నక్కపల్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్ నెం.79380 కలదు. సదరు అకౌంటుకు సంబంధించి నా క్లయింటుకు చెక్కు బుక్ ఫెసిలిటీ కలదు. నా క్లయింటు ఇండికే ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 2011 సం.లో పనిచేయుచున్నాడు. సదరు కాలంలో నా క్లయింటు తను పనిచేయుచున్న కంపెనీకు కొన్ని ఆర్థికలావాదేవీల కారణంగా తన చెక్ బుక్కులోగల ఖాళీ చెక్‌లు (13) మరియు ఖాళీ ప్రొంసరీనోట్లు (13) సంతకాలుచేసి కంపెనీ వారికి ఇచ్చియుండటం జరిగినది. సదరు లావా దేవీలు పూర్తి అయినందున సదరు చెక్కులు నోట్లు కంపెనీ వారి దగ్గర కనిపించని కారణంవలన 2012వ సం.రంలో నా క్లయింటు తన అకౌంటును నిలిపివేయడం జరిగినది. దరిమిలా సదరు కంపెనీ వారు పైన తెలిపిన 13 చెక్కులు, 13 ప్రొంసరీనోట్లు నా క్లయింటుకు తేది.15-05-2025న ఇచ్చివేసినారు. ఈ మధ్యన తేది.20-05-2025 నా క్లయింటు తన పైనతెలిపిన చెక్కులను, ప్రొంసరీనోట్లను గల ఒక ప్లాస్టిక్‌కవరులో పెట్టుకుని బోయపాడు నుండి నక్కపల్లి తన మోటారుబైకుపై వస్తున్న క్రమంలో సదరు ఫైలు ఎక్కడో పడిపోయినది. తరువాత నా క్లయింటు చూసుకుని ఎంత వెతికినను అవి కనిపించలేదు. కావున యావన్మందికీ ఈ జనరల్ నోటీసు ద్వారా తెలియచేయడమేమనగా సదరు పైన తెలిపిన చెక్కులు, ప్రొంసరీనోట్లు గల ప్లాస్టిక్‌కవరు ఎవరికైనా దొరికిన యెడల పైన తెలిపిన నా క్లయింటు అడ్రసుకు గాని లేదా నా క్లయింటు ఫోన్ నెం.7013734677కు ఫోన్‌చేసి అందచేయగలరు.

ఎస్.వి.వి.ప్రసాద్, అడ్వకేట్
రామనగర్, యలమంచిలి, అనకాపల్లి జిల్లా
Cell: 7893802452
యలమంచిలి
తేది.01-06-2025

రూ.కోట్లు వ్యయం.. ఏదీ ప్రయోజనం...

నిరుపయోగంగా గిరిజన గురుకుల భవనం

ప్రజాశక్తి-మధురవాడ : గతంలో టిడిపి ప్రభుత్వం ఉండగా నిర్మించిన పాఠశాల, కళాశాల అదనపు భవనాలకు చిన్నపాటి పనులు పెండింగులో ఉండిపోవడంతో నేటికీ నిరుపయోగంగా ఉన్నాయి. మారికవలస గురుకులాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం (2018-19) ఉన్నప్పుడు నిధులు కేటాయించారు. మారికవలస ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా జూనియర్ కళాశాల (బాలికలు), ఐటీ హిల్స్ రోడ్లో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల (బాలురు) పాఠశాలలకు కలిపి అన్ని వసతులతో అదనపు భవన సముదాయాల నిర్మాణానికి రూ.6.40కోట్లు కేటాయించింది. అప్పట్లో ఎన్నికలు రావడం, తర్వాత వైసిపి అధికారంలోకి రావడంతో ఆ పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఆ భవనాల్లో ఆకతాయిలు చేరి విలువైన సామగ్రిని ధ్వంసం చేశారు. కిటికీల అద్దాలు పగులగొట్టి మెస్‌ను చించివేశారు. మరుగుదొడ్ల తలుపులను ధ్వంసం చేశారు.

బాలుర గురుకుల సముదాయానికి కొండపై భాగం నుంచి వర్షపునీరు ప్రవేశించకుండా ఎత్తైన ప్రహరీ నిర్మించాల్సి ఉంది. రెండు గురుకులాల్లోనూ ఎలక్ట్రికల్, ఫ్లోరింగ్, రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీటిని పూర్తిచేసి అదనపు భవన సముదాయాలను వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలుర సముదాయానికి రూ.1.98కోట్లు, బాలికల సముదాయానికి రూ.1.23కోట్లను మాత్రమే విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో భవన నిర్మాణాలు సాగాయి. ఆ నిధులు సరిపోవంటూ మళ్లీ బాలుర సముదాయానికి రూ.1.75కోట్లు, బాలికల సముదాయానికి రూ.83లక్షలు కేటాయించారు. ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు విడుదలచేయకపోయినా గుత్తేదారు బిల్లులు వస్తాయన్న ఉద్దేశంతో చాలా వరకు పనులు పూర్తి చేశారు. ఆ నిధులు విడుదల కాకపోవడంతో 2022 ఫిబ్రవరిలో గుత్తేదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చివరి దశకు భవనాలను పూర్తిచేసినా బిల్లుల చెల్లింపులో తాత్సారం చేస్తున్నారని న్యాయస్థానంలో పిటిషన్ వేసి పనులను నిలిపివేశారు. దీంతో మూడేళ్లుగా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా గిరిజన శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆ భవనాలను ఈ ఏడాది అయినా వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-మధురవాడ : శిల్పారామం జాతరలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ నటరాజ కళాక్షేత్ర చిన్నారులచే నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మహాగణపతి, బ్రహ్మమొక్కటే, మూషిక వాహన, రామాయణ శబ్దం, చక్కని తల్లికి చాంగుబల, ఆదివో అల్లదివో, గోవింద గోవింద, శివతాండవం, భావములోన, గణేష్ స్తుతి, అమ్మ భవాని, ఏకదంతాయ వంటి కీర్తనలకు జయశ్రీ, మౌనిక, మహతి, భావన, హారిక, ఆనయ, కల్పన, కీర్తిక, గ్రీష్మ నృత్య ప్రదర్శన చేశారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్యాలరాజు

ప్రజాశక్తి-పేపగుంట : శ్రీ వరలక్ష్మీ నృసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రేవు ముత్యాలరాజు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ముత్యాలరాజు దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. తదుపరి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు స్వామివారి పటం, ప్రసాదాలను అందజేశారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నుదన్ను

ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చిన్నశ్రీను

ప్రజాశక్తి-మధురవాడ : కార్యకర్తలే పార్టీకి వెన్నుదన్ను అని భీమిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. ఎండాడలోని వైసిపి కార్యాలయంలో జివిఎంసి 5, 6, 7, 8, 98 వార్డులు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజకీయంలో ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయని, గెలుపోటములు సహజమని చెప్పారు. అధికారం ఉన్నప్పుడు ప్రజలతో కలిసి పనిచేస్తూ, ప్రతిపక్షంలో ప్రజల కోసం పనిచేయడం అందరూ అలవర్చుకోవాలని చెప్పారు. పార్టీలో కార్యకర్తల బాగోగులు చూసుకుంటానని, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కార్యకర్తలతోనే ప్రభుత్వం నడిపే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 4వ తారీఖున భీమిలిలో జరగబోయే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వెన్నుపోటు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నా దాస్, బిందాలం పద్మావతి, చెరుకూరి రజిని, భీమిలి ఎంపీపీ వాసురాజు, పోతిన హనుమంతురావు, పోతిన శ్రీనివాసరావు గుడ్ల పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం ప్రధానోపాధ్యాయులుగా వెంకటరావు

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మొలుగు వెంకటరావు ఆదివారం విధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పాఠశాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, దానిని కాపాడడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి స్థానిక ప్రజా ప్రతినిధులు, దాతలు, పేరెంట్స్ కమిటీ, తల్లిదండ్రులు, యూత్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారం తీసుకొని ముందుకు వెళ్తామన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలబెట్టుటకు అందర్నీ కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. ఈ సందర్భంగా పలు సంఘాలు నాయకులు దాసరి నాగేశ్వరరావు, కోటాన శ్రీను, జి.ప్రకాష్ బాబు, గణేష్ తదితరులు పుష్పగుచ్ఛంతో ఆహ్వానం పలికారు.

వెంకటరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

బోని, వెల్లంకిలో నేడు వికసిత్ కృషి సంకల్ప అభియాన్

ప్రజాశక్తి-ఆనందపురం : ఖరీఫ్ సీజన్‌ను పురస్కరించుకుని ఆనందపురం మండలంలోని బోని, వెల్లంకి గ్రామాల్లో సోమవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై కీలక సూచనలు, సాంకేతిక మెళకువలు, విస్తృతమైన వ్యవసాయ సమాచారం అందించనున్నట్లు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల ఎంపిక, సాగు పద్ధతులు, మట్టి పరీక్షలు, ఎరువుల వినియోగం తదితర అంశాలపై నిపుణులు సలహాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం, కొండెంపూడి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పాల్గొని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

దుర్మరణం చెందిన యువకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండల పరిధి సరిపల్లి నుంచి పిఎస్ఎల్ జంక్షన్‌కు వెళ్లే జాతీయ రహదారి 16లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. దీనికి సంబంధించి పెందుర్తి పోలీసుల కథనం ప్రకారం... పెందుర్తి ఆదిత్యనగర్‌కు చెందిన శరగడం దాని సత్య అవినాష్ (20), స్నేహితుడు మాడాల శ్రీరామ్ (17)కలిసి సరిపల్లి నుంచి జాతీయరహదారిలో మోటార్ సైకిల్‌పై ఆనందపురం వైపు వెళ్తున్నారు. సరిపల్లి ఫ్లైఓవర్ నుంచి ఆనందపురం వైపు రోడ్డులో ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో దాన్ని ఢీకొట్టి కింద పడిపోయారు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. దాని సత్య అవినాష్ బిటెక్ రెండో సంవత్సరం, శ్రీరామ్ ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం పందలపాక గ్రామంలో శనివారం సాయంత్రం సాయి మేఘన (12) విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఆనందపురం శ్రీ భారతి విద్యానికేతన్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సాయి మేఘన తన ఇంటి వద్ద నీటి మోటారు స్విచ్ ఆన్ చేయడానికి ప్రయత్నించగా వర్షం కారణంగా విద్యుత్ షాక్‌కు గురైకిందపడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఐటిబిపి అంబులెన్స్ ద్వారా భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వైద్యులు ఆమెను పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. సాయి మేఘన తండ్రి గండిమాని రంగా ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై విచారణ ప్రారంభించారు. యాత కులస్తులైన గండిమాని రంగా, సుజాత దంపతులకు బాబు వికాస్ (14), పాప సాయి మేఘన (12) ఉన్నారు. కుమార్తె మేఘన ఆటపాటల్లో చలాకి గా ఉండేది. పాప విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రంగా క్రేన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తగా ఉండటంతో స్థానిక పార్టీ కార్యకర్తలు, నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని జీనబాడు రహదారిపై ఆదివారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, కివర్ల గ్రామానికి చెందిన కేత దేముడు దేవరాపల్లి నుంచి కివర్ల వైపు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, అదే సమయంలో పెదబయలు నుంచి దేవరాపల్లి దిశగా వస్తున్న ఎస్. ప్రసాద్ బైక్ ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న వ్యక్తులకు తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను దేవరాపల్లి పిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. వారి ఆరోగ్యం విషమంగా ఉండడంతో 108వాహనంలో కె.కోటపాడు సిహెచ్‌సికి తరలించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి -భీమునిపట్నం : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్రలో పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 6.30 నుంచి 8 గంటల మధ్యలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం తొట్లకొండపై జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యాన సుమారు వేయి మందితో యోగాసనాలు నిర్వహించారు. తొలుత బౌద్ధ గురువులు రాజ ధమ్మ మయన్మార్, బర్మరే కాంబోడియా, బౌద్ధ సంఘ సభ్యులు ధర్మచారి ప్రార్థనలతో యోగాసనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా వేడుకలకు ప్రధాన మంత్రి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన వేదిక ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి వరకు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సుమారు 5 లక్షల మంది ప్రజలు ఇందులో భాగస్వామ్యం అయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

తొట్లకొండపై వెయ్యిమందితో నిర్వహించిన యోగాసనాలు

యోగాసనాల ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పేలా కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో ఇప్పటికే యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ట్రైనింగ్ సెంటర్లలో యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా కార్యక్రమానికి వచ్చే వారి కోసం రవాణా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, టూరిజం విభాగం అధికారులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు, నేవీ అధికారులు పాల్గొన్నారు.

సండేస్ ఆన్ సైకిల్‌లో అధ్యాపకులు, విద్యార్థులు

శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశ ప్రజలంతా శారీరక వ్యాయామం చేస్తూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వం ఫిట్ ఇండియాలో భాగంగా ఫిట్నెస్ కా డోస్ ఆదా గంట రోజ్ నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో యుజిసి ఆదేశాలకు అనుగుణంగా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని చేపట్టి, విద్యార్థుల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ సమయాన్ని శారీర వ్యాయామానికి వెచ్చించే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. యువత ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. ఆరోగ్యవంతమైన యువతతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ పరీక్షలో 'స్టార్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఎన్ఎడి కొత్త రోడ్డు సమీపం బుచ్చిరాజుపాలెంలోని స్టార్ ఎడ్యుకేషనల్ అకాడమిలో సైనిక్ స్కూల్ పరీక్షలకు తర్ఫీదు పొందిన ఉమేష్ చంద్ర (1212020277) మంచి ప్రతిభ కనబరిచినట్లు అకాడమీ కరస్పాండెంట్ రాజా తెలిపారు. అల్ ఇండియా సైనిక్ పరీక్షల్లో 269/300 సాధించారని పేర్కొన్నారు. ఆల్ ఇండియా సైనిక్ పరీక్ష ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ మార్కులు 288/300, ఇద్దరు విద్యార్థులకు మ్యాథ్స్‌లో 150/150 మార్కులు వచ్చాయని తెలిపారు. నవోదయ 2025 ఫలితాల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఫస్ట్ మార్కులు (96.26/100) సాధించిన ఏకైక విద్యాసంస్థ స్టార్ ఎడ్యుకేషన్ అకాడమీ అని పేర్కొన్నారు. నవోదయలో అడ్మిషన్ కోసం నోటిఫికేషన్ విడుదలైందని, విద్యార్థుల వయస్సు 1-5-2014 నుంచి 31-07-2026 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. జులై 29వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ మెంబర్లు

రామచంద్రనగర్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ రిక్షా కాలనీ భవన నిర్మాణం కార్మిక సంఘం, నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎ.సుదర్శనరావు, ఉపాధ్యక్షులుగా ఎల్.శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.త్రినాథరావు, జాయింట్ కార్యదర్శిగా ఎన్.భీమారావు, కోశాధికారిగా జి.రాజారావు, జాయింట్ కోశాధికారిగా టి.శ్రీరామమూర్తి, గౌరవాధ్యక్షులుగా జి.అర్జునరావు, కె.త్రినాథరావు, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా ఎస్.మోహనరావు, వి.మోహనరావు, జి.రఘు, ఎం.రాము, టి.రమణ, వి.సింహాచలం, వి.నాయుడు ఎన్నికయ్యారు.

ఘనంగా నూకరాజు జన్మదిన వేడుకలు

గంటా నూకరాజును గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు జన్మదిన వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో సాధారణ కార్యకర్త నుంచి చారిత్రక పురపాలక సంఘంలో కౌన్సిలర్‌గా, కో ఆప్షన్ సభ్యునిగా ప్రాతినిధ్యం వహించడంలో స్థానిక ప్రజలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. పార్టీ అధిష్టానం తనకు వార్డు అధ్యక్షునిగా, రాష్ట్ర కార్యదర్శిగా పదవులు ఇచ్చి గౌరవించిందన్నారు. మొన్నటి జివిఎంసి ఎన్నికల్లో వైసిపి హవాలో కూడా తన భార్య అప్పలకొండను మూడో వార్డు నుంచి కార్పొరేటర్‌గా గెలిపించడంలో పార్టీ కార్యకర్తలు, అభిమానుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా నూకరాజును పార్టీ కార్యకర్తలు గజమాలతో ఘనంగా సత్కరించారు.

హుషారుగా సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు హిందీ గీతాలతో శారదా స్వర సంగమం నిర్వహించిన సినీ సంగీత విభావరి హుషారు గొలిపింది. పౌర గ్రంథాలయంలో నిర్వహించిన ఈ సంగీత విభావరిని నగర ప్రముఖులు సన్‌మూర్తి, ఫణి స్వామి, సుజని, లోకేష్, మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పాత, కొత్త పాటల మేళవింపుగా హుషారైన గీతాలను నగరానికి చెందిన పలువురు గాయనీగాయకులు ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకులు లెఫ్ట్‌నెంట్ లోకేష్ నిర్వహణలో జరిగిన సంగీత విభావరిలో వానలక్ష్మి, సుజని, సునీతరెడ్డి, సత్యనారాయణ, కృష్ణవేణి, మంజుల, శారద, లక్ష్మీసాత్విక, అప్పారావు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలు గుర్తింపునిస్తాయి : విసి

ప్రజాశక్తి- విశాఖపట్నం : నిబద్ధతతో అందించే సేవలు ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపునిస్తాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైనాన్స్ అధికారిగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వి.సూర్యారావును ఆయన సత్కరించారు. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సూర్యారావు దంపతులను సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

టిడ్కో గృహ లబ్ధిదారుల ఆందోళన

ఆందోళన చేస్తున్న టిడ్కో గృహ లబ్ధిదారులు

ప్రజాశక్తి -గాజువాక : దువ్వాడ మంగళపాలెంలోని టిడ్కో గృహాల వద్ద రోడ్డుపై లబ్ధిదారులు ఆదివారం బైఠాయించి నిరసన తెలిపారు. తక్షణమే గృహాలు మంజూరు చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, టిడ్కో ఇళ్లు నిర్మించి పదేళ్లు దాటినప్పటికీ లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. కొంత మందికి సేల్ డీడ్‌లు ఇవ్వలేదని తెలిపారు. లబ్ధిదారులు టిడ్కో ఇళ్లకు డబ్బులు చెల్లించినప్పటికీ గృహాలను అలాట్‌మెంట్ చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. లబ్ధిదారుల ఆందోళనతో టిడ్కో, టాటా ప్రాజెక్టు అధికారులు స్పందించి చర్చలకు వచ్చారని తెలిపారు. మూడు రోజుల్లో స్థానిక ఎమ్మెల్యే, అధికారులతో చర్చిస్తామని, మూడు నెలలలో కనీస సౌకర్యాలు కల్పించి, లబ్ధిదారులకు గృహాలను అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ చర్చల్లో టిడ్కో డిఇ రాజేష్ , టాటా ప్రాజెక్టు అధికారి సోమేష్, దువ్వాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వనజాక్షి, సమితి సభ్యులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పిల్లా పద్మ, టిడ్కో గృహ లబ్ధిదారులు రొక్కం శ్రీనివాసరావు, గోపి, పి.అప్పలరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

వైసిపి యూత్ జోనల్ ప్రెసిడెంట్‌గా అంబటి

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి స్టేట్ యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్‌గా అంబటి శైలేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శైలేష్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. వైసిపిలో యువతకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందన్నారు. పదవి రావడంలో సహకరించిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం జంక్షన్‌లోనిఒక ప్రయివేటు కార్యాలయంలో జర్నలిస్టుల పిల్లలు సుమారు 20 మందికి ఆదివారం ఉపకార వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, జర్నలిస్టుల పిల్లల్లో అత్యంత ప్రతిభావంతులున్నారని వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే తన పరిధి మేరకు ఏటా ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎల్‌కెజి నుంచి ఇంటర్ వరకు ఒక కేటగిరి కింద, ఉన్నత విద్యాభ్యాసం సాగించిన వారికి మరో కేటగిరి కింద ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి, ప్రశంసా పత్రం, నగదు ప్రోత్సాహం అందజేసినట్లు చెప్పారు. సమాజం కోసం పాటుపడే జర్నలిస్టులకు విద్య, వైద్య సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి-వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహలక్ష్మి నృసింహ స్వామి దేవస్థానంలో స్వామి వారికి 108 బంగారు సంపెంగలతో ఆదివారం అత్యంత వైభవంగా స్వర్ణపుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థాన వేదపండితులు శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన జరిపారు.

రాంబిల్లిలో సిపిఎం సమైక్యతా ర్యాలీ

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సమైక్యతా ర్యాలీ

ప్రజాశక్తి - రాంబిల్లి : పెహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ, రాంబిల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. భారతదేశ సమైక్యత వర్ధిల్లాలని, మతతత్వం నశించాలని, లౌకికతత్వం, మతసామరస్యం, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని, యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించాలని నినదిస్తూ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడునాయుడు మాట్లాడుతూ పెహల్గాం దాడి అనంతరం, మన దేశ సైనికులు ఎంతో ధైర్య సాహసాలతో, పాక్ ఆక్రమిత ప్రాంతంలో ఉగ్రవాద స్థావరాలను మట్టుపెట్టి మన దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి సాటి చెప్పిన సైనికులకు సెల్యూట్ చేస్తూ, యావత్ దేశమంతా, అన్ని రాజకీయ పార్టీలు, అన్ని మతాల ప్రజలు, లౌకికవాదులు అండగా నిలిచారని కొనియాడారు. భారత్ పాక్ యుద్ధాన్ని తానే ఆపామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పడం ద్వారా దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం కనిపిస్తోందని, దీన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించకపోవడాన్ని బట్టి ఒప్పుకున్నట్లే కనిపిస్తోందన్నారు. ఘటన అనంతరం దేశంలో మతతత్వ గొడవలు, రెచ్చగొట్టే కొన్ని శక్తులు విషప్రచారం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం అరికట్టే చర్యలు చేపట్టకపోవడం దారుణం అన్నారు. పెహల్గామ్ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు చనిపోయారా, లేదా బతికే ఉన్నారా అన్నది కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేశారు. భద్రతా వైఫల్యం వలనే జరిగిన పెహల్గాం ఘటనకు కేంద్రం బాధ్యత వహించాలని, దీనిపై మత గొడవలు పెంచకుండా, మతసామరస్యాన్ని కాపాడాలని, దేశ సమైక్యత, సార్వభౌమాధికారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

జెవివిలో చేరండి

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - అచ్యుతాపురం : ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని, మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను జన విజ్ఞాన వేదిక చైతన్యవంతం చేస్తోందని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకటప్పారావు అన్నారు. ఆదివారం మండలంలోని హరిపాలెం గ్రామంలో జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు పోస్టరును జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జన విజ్ఞాన వేదిక 38ఏళ్లుగా తెలుగు మనిషి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునే శక్తి మనిషికే వుంది. ఆ సమస్యలకు పరిష్కారాలు కూడా సమాజంలోనే ఉన్నాయన్నారు.. సామాజిక అంశాల విశ్లేషణ, అధ్యయనాలను శాస్త్రీయ, హేతువాద దృక్పథంతో చేసే ఆలోచనను ప్రజానీకంలో ప్రోది చేయాలన్న ఆశయంతో పని చేసే ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థ జనవిజ్ఞాన వేదికలో సభ్యులు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఉన్నతమైన శాస్త్రీయ సమాజం కోసం ప్రజాసైన్స్ ఉద్యమానికి తోడ్పాటు అందించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేడ రామ్ కుమార్, రైతు సంఘం నాయకులు కాంగ్రెగుల రామ్ సదాశివరావు పాల్గొన్నారు.

వాలిన విద్యుత్ స్తంభాలు

భయాందోళనలో ప్రజలు

టిడ్కో ఇళ్లకు వెళ్లే దారిలో వాలిపోయిన విద్యుత్ లైన్

ప్రజాశక్తి - యలమంచిలి : ఇటీవల కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు మండలంలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. మరికొన్ని ఒరిగాయి. ముఖ్యంగా పొలాల్లో ఒరిగిన స్తంభాల మూలంగా పెద్ద ప్రమాదాలేమీ లేకపోయినా, పట్టణంలో ఒరిగిన స్తంభాలతోనే ప్రమాదం పొంచివుంది. పెద్దపల్లి, జంపపాలెం పొలాల్లో కొన్ని స్తంభాలు ఒరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. రామనగర్ టిడ్కో ఇళ్లకు వెళ్లే రహదారి పక్కనే రోడ్డుపైకి ఒరిగిన విద్యుత్ స్తంభం ఎప్పుడైనా కూలిపోయేలా ఉండి, భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఒరిగిన స్తంభాలకు వెంటనే మరమ్మతులు చేపట్టి సపోర్టు స్తంభాలు వేయాలని స్థానికులు కోరుతున్నారు. చెట్టుగుండా వెళ్లే విద్యుత్‌లైన్లు మూలంగా వర్షాల రాకతో విద్యుత్‌కు తరచూ అంతరాయం జరిగితోంది. ట్రీ కటింగ్ పేరుతో వర్షాలకు ముందే చర్యలు తీసుకుంటున్నా విద్యుత్‌కు అంతరాయం తప్పడం లేదు. దీనిపై సంబంధిత ఎపిఈపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఏఇఇ కనకరాజు దృష్టికి తీసుకెళ్లగా. వీలైనంత తొందరలో విద్యుత్ స్తంభాల సమస్యను పరిష్కరిస్తామన్నారు.

భూసార పరీక్షలతో మేలు

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కశింకోట : భూసార పరీక్షల ఆధారంగా పంటలు, సాగు యాజమాన్యం చేయడం ద్వారా మంచి ప్రయోజనాలు పొందవచ్చని బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి శ్రీహరిరావు అన్నారు. ఆ దివారం హరిపురం బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో మండలంలోని ఎన్జి.పాలెం రైతు సేవా కేంద్రం వద్ద వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీహరిరావు మట్టి ఆరోగ్య పరిరక్షణ, సహజ ఎరువుల వాడకంపై రైతులకు వివరించారు అలాగే పశు వైద్యశాస్త్రవేత్త డాక్టర్ విజయరాణి మాట్లాడుతూ, పశుగ్రాస సాగు, వానా కాలంలో పశువుల సంరక్షణపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు నక్కిన మధు, కూటమి నాయకులు కలిగట్ల సింహాద్రిరావు, యలమంచిలి వెంకటరావు, ఆనంద్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం కొండపాలెం, కెపి.అగ్రహారం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డిఎఒ మోహనరావు మాట్లాడుతూ, వర్షాలు కురిసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన సాగు చర్యలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. భూసారపరీక్షలు చేయించుకోవడం ద్వారా పంటల ఎంపిక, సాగు ఇతర యాజమాన్య పద్ధతులను పాటించి, మంచిదిగుబడులను పొందవచ్చన్నారు.కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రాజ్‌కుమార్, కొండపాలెం, కెపి అగ్రహారం సర్పంచ్‌లు మచ్చకర్ల భవాని, గోపిశెట్టి శ్రీనివాసరావు, ముచ్చర్ల వెంకటస్వామి నాయుడు, శాస్త్రవేత్తలు ఎం.వెంకటేష్, టి.కిరణ్ పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో మంచి భవిష్యత్

శిక్షణ సర్టిఫికెట్లతో విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : భవిష్యత్తంతా కృత్రిమ మేధ (ఏఐ), వర్చువల్ రియాలిటీ, బ్లాక్‌చైన్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ మొదలగు ఆధునిక రంగాలదేనని ఎన్‌టిఆర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు అన్నారు. ఆదివారం గౌరీ గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు ముగింపు సమావేశంలో మాట్లాడుతూ డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి గ్రామీణ్ డిజిటల్ సాక్షరతా అభియాన్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారతదేశంలో 38 శాతం కుటుంబాలకే డిజిటల్ అక్షరాస్యత ఉందని, ఇంటర్నెట్, విద్యుత్తు సదుపాయాలు సరిగ్గా లేకపోవడం, బోధకుల కొరత కంప్యూటర్ విద్యకు అవరోధాలుగా మారుతున్నాయని కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దైనందిన జీవితంలో అంతర్భాగమైందన్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఇంటర్నెట్ సదుపాయం లేనిదే రోజు గడవడంటే అతిశయోక్తి కాదన్నారు. సాంకేతికతల ద్వారా ప్రయోజనాలను అందిపుచ్చుకోవడం ఎంత అవసరమో, సైబర్ మోసాలకు చిక్కుకుండా జాగ్రత్తపడటమూ అంతే కీలకమన్నారు. అందుకోసం కంప్యూటర్ అక్షరాస్యత ఎంతో అవసరమన్నారు. . కంప్యూటర్ ఆవశ్యకత పెరిగిన నేపథ్యంలో గౌరీ గ్రంథాలయం 17 ఏళ్లుగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కంప్యూటర్ కోర్సుల్లో చేరడం ద్వారా ఇంగ్లీషు భాషపై పట్టు వస్తుందన్నారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ కంప్యూటర్ బేసిక్స్, ఫండమెంటల్స్, ఎంఎస్-ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్,ఇంగ్లీష్ టైపింగ్, కమ్యూనికేటివ్, టాలీ ప్రైమ్, బేసిక్ అకౌంట్స్, అడ్వాన్సుడు ఎంఎస్-ఎక్సెల్ వంటి అంశాలపై ఏటా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా తరగతులు తుది పరీక్షల్లో పోటీ విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, బోధకులు శరగడం కిషోర్‌బాబు, యు.వినీల, కె.లక్ష్మి, గ్రంథాలయ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎన్ఎఫ్ఐ.), బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్వాకంతో వీధిన పడ్డాం

ఎండియు వాహన నిర్వాహకుల ఆవేదన

ప్రజాశక్తి - యలమంచిలి : ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసే మొబైల్ డెస్పెన్సింగ్ యూనిట్ (ఎండియు) విధానాన్ని ఏకపక్షంగా రద్దుచేసిన ప్రభుత్వ నిర్ణయంతో తామంతా జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడ్డామని ఎండియు నిర్వాహకుల సంఘం ప్రతినిధి నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ యలమంచిలిలో 15 ఎండియు వాహనాల ద్వారా నిర్వాహకులు, సహాయకులు 30మంది జీవనోపాధి పొందామన్నారు. ప్రభుత్వం రేషన్‌డిపోలను పునరుద్ధరించడంతో తమకు ఉపాధి దూరమైందని వాపోయారు. దీనికి తోడు ఎండియు వాహనాలు కొనుగోలు సమయంలో చేసుకున్న ఒప్పందాల ప్రకారం,60శాతం ప్రభుత్వం చెల్లించగా, తాము మొదట్లోనే లబ్దిదారు వాటాగా పదిశాతం చెల్లించామన్నారు .మిగిలిన 30శాతం మొత్తాన్ని బ్యాంకు రుణం తీసుకోగా, దాన్ని వడ్డీలతో కలుపుకుని వాయిదాలు రూపంలో తీర్చాల్సి ఉందన్నారు. బ్యాంకు రుణబకాయి తీరకముందే ఎండియులను రద్దు చేయడంతో తమపై ఇకనుంచి అదనంగా ఇఎంఐల భారం పడుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి, తమకు న్యాయం చేయాలని సురేష్ వేడుకున్నారు.

ముగిసిన ఉచిత శిక్షణా తరగతులు

శాస్త్రవేత్త దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో గ్రాడ్యుయేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతనెల 7న ప్రారంభమైన వేసవి ఉచిత శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన తోటాడకు చెందిన డిఆర్‌డిఒ శాస్త్రవేత్త పెర్ని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో గ్రాడ్యుయేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో మందిని ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్లేలా ఉన్నాయని ప్రశంసించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, రవితేజ మాట్లాడుతూ జిల్లా, ఇతర రాష్ట్రాలలో విధి నిర్వహణలో ఉన్న క్లబ్ సభ్యులు గ్రామంలో చేస్తున్న కార్యక్రమాలలో భాగస్వాములు కావడం ప్రశంసనీయమన్నారు. ప్రతిరోజు 50 మంది విద్యార్థులకు భగవద్గీత పఠనం, మెదడుకు మేత, కంప్యూటర్ శిక్షణ, డ్రాయింగ్ వంటి క్లాసులు నిర్వహించామన్నారు. అనంతరం డిఆర్‌డిఒ శాస్త్రవేత్త దుర్గాప్రసాద్‌ను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. వేసవి శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం


సాయం చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి- వడ్డాది : పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు ఆదివారం బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్టలో ఇటీవల అగ్ని ప్రమాదంలో పశువుల పాకలు, పూరిళ్లు దగ్ధమైన ఘటనలో బాధిత పాడి రైతులకు విశాఖ డెయిరీ తరపున ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున నగదు సాయం చెక్కులు అందించారు ఈ ప్రమాదంలో జక్కన్న, పైడినాయుడుల పశువులపాకలతోపాటు సానబోయిన అప్పారావు పూరిల్లు దగ్గమైంది. కార్యక్రమంలో సర్పంచ్ మెరుగు కుమారి మాజీ ఎంపిటిసి దొండా శ్రీను, తమరాన దాసు, సాయం శేషు పాల సంఘం సెక్రెటరీ దవారసింగ శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రయోజనం

గొలుగొండలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- గొలుగొండ :స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా ఆదివారం గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు.అనంతరం గ్రంథాలయాధికారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. గ్రంథాలయాధికారి జగన్ జనరల్ నాలెడ్జిపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాల్లో వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాభివృద్ధి పొందాలని సూచించారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు

అచ్యుతాపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలకు వచ్చిన విద్యార్థులకు రీసోర్స్ పర్సన్‌గా నావెల్ డాక్‌యార్డ్ ఉద్యోగి ఎన్.నరేష్‌వర్మ పాల్గొని, పిల్లలతో టగ్‌ఆఫ్‌వార్, వెయిట్‌లు ఎత్తడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో మేధాశక్తితో పాటు బల శక్తి నిరూపించుకోవాలన్నారు. లైబ్రేరియన్ దొడ్డి కోటేశ్వరరావు పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు.

నక్కపల్లి:మండలంలో చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పుస్తక పఠనం నిర్వహించారు. విద్యార్థులతో పలు పుస్తకాలను చదివించారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయడంతో మేధస్సు పెంపొందుతుందన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంథాల యంలో ఆదివారం వేసవి శిక్షణా శిబిరం కొన సాగుతోంది. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి. ప్రభాకర్ మాట్లాడుతూ, "ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం" ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు ప్రకాష్ విద్యార్థులకు గ్రంథాలయం ఉపయోగాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయధికారిణి పి. దమయంతి మాట్లాడుతూ, సోమవారం జరిగే చదరంగం పోటీల్లో పాల్గొనాలని కోరారు. పోటీలో విజేతలకు చివరి రోజున బహుమతులు అందచేస్తామన్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : పెద్దబొడ్డేపల్లి జంక్షన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో గంజాయి పట్టుబడిందని సిఐ గోవిందరావు తెలిపారు. వివరాలివి. గంజాయి అక్రమ రవాణాపై సిఐకి పక్కాగా అందిన సమాచారం మేరకు ఎస్సై రమేష్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. చోడవరం రోడ్డు నుండి ఇద్దరు వ్యక్తులు లగేజ్ బ్యాగులతో రావడం గమనించి వారిని పట్టుకుని తనిఖీ చేయగా ఎనిమిది కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. తమిళనాడు కోయంబత్తూర్‌కు చెందిన ఇద్దరు నిందితులు తమిళనాడు నుంచి విశాఖ రైలులో వచ్చి, అక్కడ నుంచి చీడికాడలోని కొనటం నాగకుమార్ నాని వద్ద 8కిలోల గంజాయి కొని, తిరిగి వెలుతున్న క్రమంలో పెద్ద బొడ్డేపల్లి జంక్షన్ వద్ద పట్టు పడ్డారని సిఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి, అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పట్టుబడిన గంజాయితో నిందితులు

రేషన్ డిపోల పునరుద్ధరణపై మిశ్రమ స్పందన

- డీలర్లలో ఆనందం : ఎండియు ఆపరేటర్లలో ఆవేదన
- తొలిరోజున కార్డుదారుల్లో భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్/ భీమునిపట్నం : రేషన్ డిపోల పునరుద్ధరణ పై కార్డుదారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. కొందరు ఈ విధానాన్ని స్వాగతిస్తుండగా, ఎండియు (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) వాహనాల్లో ఇంటింటికీ కాకున్నా, వీధుల్లోకి తెచ్చి అందజేసే విధానం ఉపయోగకరంగా ఉండేదనిపలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా రేషన్‌డిపోలను మళ్లీ ప్రారంభించడంపై డీలర్లు ఆనందం వ్యక్తం చేస్తుండగా, ఇప్పటివరకు అమలులో ఉన్న ఎండియు వాహనాలు మూలకు చేరిపోవడంతో ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండియు వాహనాలను రద్దుచేసి, రేషన్‌డిపోల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ విధానాన్ని పునరుద్ధరిస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు ఆదివారం డిపోల వద్దే రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియను అధికారులతో కలిసి కూటమి నేతలు ఆర్భాటంగా ప్రారంభించారు. డిపోల వద్దకు రాగలిగే వారిని ఇక్కడే సరుకులు ఇచ్చే పరిస్థితి ఉండగా, వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందజేస్తామని అధికారులు, నేతలు చెబుతున్నారు. దీంతో గత ప్రభుత్వం ప్రారంభించిన ఇంటింటికీ రేషన్ పథకం. ముగిసినట్లే. దీంతో ఈ విధానంలో ఉపయోగించిన వాహనాలన్నీ మూలకు చేరిపోయినట్లే. మరోపక్క సరుకులను ఇంటి వద్దకు తీసుకెళ్లి పంపిణీ చేసిన వాహనాలు మూలక చేరిపోయాయి. దీనిపై రేషన్ డీలర్లు ఆనందం వ్యక్తం చేస్తుండగా, ఉపాధిని కోల్పోయి తాము రోడ్డున పడ్డామని ఎండియు నిర్వాహకులు, హెల్పర్లు క్షోభకు గురౌతున్నారు. తొలిరోజున రేషన్ డిపోల వద్ద

అనకాపల్లిలో రేషన్‌డిపో వద్ద కార్డుదారులు

రేషన్ పంపిణీ మందకొడిగానే సాగింది. సరుకులకు వచ్చే కార్డుదారులు కూడా డిపోల వద్ద పలుచగా కనిపించారు. అయితే డిపోల వద్ద బియ్యం, పంచదార పంపిణీతో సరిపెట్టడంతో కొందరు పెదవి విరచడం కనిపించింది. కాగా మునుపటిలా బియ్యం, పంచదారతోనే సరిపుచ్చకుండా ఇటు రేషన్ ప్రక్రియపై ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అవుతుంది. ఏదేమైనా తొలి రోజు రేషన్ పంపిణీ చాలాచోట్ల మందకొడిగానే జరిగింది. దీనిపై ప్రజల్లో అంతగా ప్రచారం లేకపోవడం, లేకుంటే 15 రోజులకు వరకు వెళ్లి తీసుకోవచ్చనే అభిప్రాయం వల్ల కార్డుదారుల తాకిడి ఉండకపోవచ్చని భావిస్తున్నారు. మొత్తానికి ఎండియు వాహనాలను రద్దుచేసి, రేషన్‌డిపోల పునరుద్ధరణపై మిశ్రమ స్పందన వ్యక్తమౌతోంది.

ఉత్సాహంగా ఐటిఎపి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐటీ అండ్ ఐటిఇఎస్ కంపెనీలను కలిగి ఉన్న ఐటి అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటిఎపి) 2025 వార్షికోత్సవాన్ని సిరిపురంలోని వియంఆర్‌డిఎ చిల్డ్రన్స్ అరీనాలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఐటిఎపి వైస్ ప్రెసిడెంట్ వార్షిక ఈవెంట్ నిర్వాహకుడు కిషోర్ దాసరి మాట్లాడుతూ2024-25 ఆర్థిక సంవత్సరం విజయవంతంగా పూర్తయి, కొత్త ఆర్థిక సంవత్సరాన్ని వృద్ధి విజయం వైపు కొత్త నిబద్ధతతో ప్రారంభించడానికి వార్షిక కార్యక్రమం ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలను, వారి ఉద్యోగులను ఒకే వేదికపైకి తీసుకువస్తుందన్నారు. కార్యక్రమంలో వెయ్యి మంది ఉద్యోగులు, కంపెనీల అధిపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. 200 కంపెనీల నుండి సుమారు 200 మంది ఉద్యోగుల ప్రత్యేక ప్రతిభను ప్రదర్శించే సాంస్కృతిక వాలెడిక్టరీ కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది ఈవెంట్లలో 30 కంపెనీల క్రీడాకారులు పాల్గొనగా, వారికి బహుమతులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఇళ్ల పేరుతో ఘరానా మోసం

- రూ.3 కోట్లు వసూలుచేసి ఉడాయించిన నిందితుడు
- న్యాయం చేయాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

కెవిపిఎస్ ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: తన ప్లాట్‌లో ఇల్లు కట్టించి ఇస్తానని చెప్పి పలువురి నుంచి సుమారు రూ.3 కోట్లు వసూలు చేసి పరారైన వ్యక్తిని అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాంనగర్‌లో మోసానికి పాల్పడిన పాల వెంకట అప్పలరాజు ఇంటి నుంచి ఎల్ఐసి అంబేద్కర్ విగ్రహం వరకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, వెంకటలక్ష్మి అనే మహిళ తన భర్త వైద్యానికి డబ్బులుతిరిగి ఇమ్మనిఅడిగితే మోసగాడి బాగోతం బయటపడిందన్నారు. డబ్బు తిరిగిమ్మని వచ్చిన వెంకటలక్ష్మిని కులంపేరుతో దూషించడమే కాకుండా, గుండెలపై చేతులేసి నెట్టి దౌర్జన్యం చేశాడన్నారు. బాధిత మహిళలు మాట్లాడుతూ ఒక ఫ్లాట్ చూపించి అనేక మంది దగ్గర డబ్బులు తీసుకొని వెంకట అప్పలరాజు మోసగించాడని ఆరోపించారు.తమ కుటుంబ సభ్యుల దగ్గరే రూ.45 లక్షల వరకు తీసుకొని,ప్లాట్లు ఇవ్వకపోగా డబ్బులు అయినా ఇవ్వండి అని అడిగినందుకు దళితుల పేరుతో దూషించి,దౌర్జన్యం చేశాడన్నారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి, మోసగాన్ని అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని మహిళలు కోరారు. . మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ప్రవర్తించిన తీరుని తప్పుపట్టారు. నిందితుడు డబ్బులు లాక్కొని మోసం చేయడంతోపాటు కులదూషణకు పాల్పడి రెండు తప్పులు చేసినా పోలీసులు తగు చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం. సుబ్బారావు, చంద్రమౌళి ఎర్రి బాబు,సంజీవ్ అప్పన్న పాల్గొన్నారు.

4న 'వెన్నుపోటు దినం' నిరసనలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు బొత్స, బాబూరావు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై ఈ నెల 4న వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వైసిపి నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం పలుచోట్ల పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు కెకె.రాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, శాసన మండలి సభ్యులు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గడిచిన సంవత్సర కాలంగా వైసిపిపై నిందలు వేయడం తప్ప పాలనపై దృష్టి పెట్టలేదన్నారు. విశాఖ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో వెన్నుపోటు దినం కార్యక్రమం చేపట్టి ఆయా ప్రాంతాల్లోని అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, డాక్టర్ పి.రవీంద్రబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్ కుమార్, వాసుపల్లి గణేష్ కుమార్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణ కుమారి, నేతలు జీలకర్ర నరేంద్ర, రవి రెడ్డి పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఎన్నికల హామీలను అమలు చేయకుండా

వైసిపి ఆధ్వర్యాన పోస్టర్ల ఆవిష్కరణ

టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ డిప్యూటీ సిఎం, వైసిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు మండిపడ్డారు. ఆదివారం మండలంలోని తారువలో మాడుగుల నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు మోసాలను ఎండగడుతూ ఈనెల 4న మాడుగులలో నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'వెన్నుపోటు దినం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపిపి చింతల బుల్లిలక్ష్మీ, జెడ్‌పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపిపి పంచాడ సింహాచలం నాయుడు, సర్పంచులు నాగిరెడ్డి శరారినాయుడు, దాడి జగన్, దాసరి సంతోష్ కుమార్,ఎంపిటిసి పోతల వెంకటరావు పాల్గొన్నారు.

సబ్బవరం : ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను నిరసిస్తూ ఈనెల 4న నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తెలిపారు. పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో సంబంధిత వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నేతలు బైలపూడి భగవాన్ జయరాం, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు,కోటాన రాము,యర్ర శ్రీనివాసరావు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, నారపిన్ని అప్పలరాజు, పెచ్చెట్టి రమేష్ప నాయుడు పాల్గొన్నారు.

వడ్డాది : ఈనెల 5న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు కొల్లిమల్ల అచ్చినాయుడు, జడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపిపి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం బూడి

దొండ నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం వడ్డాదిలో పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ, 4న నియోజకవర్గ కేంద్రం చోడవరంలో మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గుడివాడ అమర్‌నాథ్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ, తహశీల్దార్‌కు వినతిపత్రాలను అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మాణిక్యం, విజయ్ కుమార్ ,ఈశ్వరరావు, మొల్లి శ్రీను పాల్గొన్నారు

రావికమతం: ఈనెల 4న చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ప్రజలంతా జయప్రదం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మి నాయుడు కోరారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు తన మామకు ఏ విధంగా వెన్నుపోటు పొడిచి అధికార పీఠాన్ని దక్కించుకున్నారో ఈరోజు ప్రజలను కూడా సూపర్ -6 హామీలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ కంచిపాటి జగ్గరావు, డిసిసి బ్యాంక్ పూర్వ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, ఉప సర్పంచ్ పందల దేవ, ప్రోటోకాల్ జడ్పిటిసి తలారి ఆదిమూర్తి పాల్గొన్నారు.

డిపోల్లో రేషన్ పంపిణీ ప్రారంభం

తొలి రోజు సరుకులు అందజేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

వడ్డాదిలో రేషన్ పంపిణీ చేస్తున్న తాతయ్యబాబు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రేషన్ డిపోల వద్ద సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని కూటమి నాయకులు ప్రారంభించారు. రేషన్ డీలర్లు బియ్యం, పంచదార ను లబ్ధిదారులకు అందజేశారు. సర్వర్ అనేకసార్లు మొరాయించడంతో లబ్ధిదారులు, రేషన్ డీలర్లు ఇబ్బందులు పడ్డారు. కందిపప్పు సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు.

రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో రేషన్ డిపోను సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఆదివారం ప్రారంభించారు. 65 ఏళ్ల నిండిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకు డీలర్ ద్వారా రైస్ పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలో రేషన్ సరుకులను తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, నర్సీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన సూర్యచంద్ర, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తహశీల్దార్ వేణుగోపాల్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్షణమూర్తి, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ అపిరెడ్డి మాణిక్యం, తాండవ డిసి మెంబర్ పారుపల్లి దాసు పాల్గొన్నారు.

కోటవురట్ల:రేషన్ సరుకులు లబ్ధిదారులకు సకాలంలో అందే విధంగా చర్యలు చేపట్టాలని తహసిల్దారు తిరుమలబాబు కోరారు.మండల కేంద్రంలో సంతబైల వద్ద రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. జగ్గంపేట షాపు వద్ద సర్వర్ మొరాయించడంతో ఆఫ్ లైన్ లో అందజేశామన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, టిడిపి సీనియర్ నాయకులు జానకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ :మండలంలోని చెట్టుపల్లిలో కూటమి నాయకులు సరుకుల పంపిణీ ప్రారంభించారు.

చీడికాడ:మండల కేంద్రంలో తహసిల్దార్, సర్పంచ్ గాలి సామాలమ్మలు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ బియ్యం పంపిణీలో ఎటువంటి అక్రమాల కు తావివ్వకుండా ప్రజలకు సక్రమంగా అందజేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో టిడిపి నేత ఎర్ర అప్పారావు పాల్గొన్నారు.

మాడుగుల:మాడుగుల కేంద్రంతో పాటు మండలంలో పలు రేషన్ డిపోలు పున: ప్రారంభమయ్యాయి. మాడుగుల కేంద్రంలో సూపర్ బజార్ ఒకటి రెండు కేంద్రాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి మోహనరావు, తహసిల్దార్ కే రమాదేవి, సర్పంచ్ ఎడ్ల కళావతి రేషన్ పంపిణీ సరుకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తసిల్దార్ రమాదేవి మాట్లాడుతూ మండలంలో 47 రేషన్ డిపోలు ఉన్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిటి లక్ష్మయ్య పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ గ్రామంలో రేషన్ డిపోను డిప్యూటీ తహశీల్దార్ చైనులు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు గండేపల్లి రాము, గ్రామ పార్టీ అధ్యక్షులు పోతున లోవ, మాజీ సర్పంచ్ కొమురవోలు చిట్టిబాబు, మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏఎల్.పురంలో మాజీ జెడ్పిటిసి సిహెచ్.తారక వేణుగోపాల్, సీనియర్ టిడిపి నాయకులు, లింగంపేటలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గండెం దొరబాబు రేషన్ డిపోలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బొడ్డు జమీలు, నీటి సంఘం చైర్మన్ ముఖ్వల సత్తిబాబు, పెట్ల నారాయణమూర్తి, పోతల రాజుల నాయుడు, గొంప వాసు, చింతల స్వామి నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : భవిష్యత్తులో రేషన్ షాపులను మినీ షాపింగ్ మాల్స్‌గా మార్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం కోట్ని వీధి 15వ నెంబర్ చౌక ధరల దుకాణంలో రేషన్‌డిపోలద్వారా సరుకుల పంపిణీని ప్రారంభించారు కార్యక్రమంలో డిఆర్‌ఓ వై సత్యనారాయణ రావు, ఆర్‌డిఓ షేక్ అయిషా, జిల్లా సరఫరా అధికారి కెఎల్‌ఎన్ మూర్తి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్‌ఎం రాధాకృష్ణ, విజిలెన్స్ కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, తహశీల్దార్ బి. విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో చింతలపాలెంలో రేషన్ డిపో పున్నప్రారంభం సందర్భంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. రేషన్ పంపిణీని ప్రారంభించారు. మాజీ సర్పంచ్ కర్రి దుర్గ నాయడు, జెర్రిపోతులు నూకి నాయడు, కొన రమణ పాల్గొన్నారు. తాళ్ళపాలెం డిపో వద్ద అనకాపల్లి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉల్లింగల రమేష్, గ్రామ సర్పంచ్ రెల్లి నాగయమ్మ, కర్రి వెంకట సత్యనారాయణ, గల్లా రాజు, బయ్యవరంలో ఎస్‌కె. బాబర్, శిరం వెంకట లక్ష్మి, విఆర్‌ఓ సత్య నారాయణ రేషన్ పంపిణీ చేశారు

పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో రెండు రేషన్ షాపులను జనసేన పరవాడ మండల్ ఇన్‌ఛార్జి పంచకర్ల ప్రసాద్, సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, మాజీ ఎంపిపి పైల జగన్నాధరావు, ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఆర్ సునీత, బోనంగి, రావాడ సర్పంచ్‌లు బొద్దపు శ్రీనివాస్, మోటూరు సన్యాసినాయుడు, బి రామ గోవిందరావు, పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని చింతవా పంచాయతీ శివారు లోవపాలెంలో రేషన్‌డిపోను జనసేన మండల ఉపాధ్యక్షుడు ఎరిపిల్లి సత్తిబాబు టిడిపి నేత చోడి పిల్లి గంగరాజు ప్రారంభించారు.

మునగపాక: మండలంలోని వెంకటాపురంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ , మునగపాక, అరబ్బు పాలెం గ్రామాలలో ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు రేషన్ డిపోలను ప్రారంభించి, సరుకులు పంపిణీ చేశారు. నేతలు కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్, టెక్కలి పరశురాం, దాడి ముసలి నాయుడు, ఆడారి జానకి, తహశీల్దార్ ఆదిమహేశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్లలో...

దేవరాపల్లి : మండల కేంద్రంలో నాలుగు రేషన్ దుకాణాలను తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, డిప్యూటీ తహశీల్దార్ కె.అప్పారావు, వీఆర్వో నాగేశ్వరరావు పర్యవేక్షించారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పోతల పాత్రునాయుడు, పె

బుచ్చయ్యపేట : మండలంలో బంగారు మెట్టలో రేషన్ సరుకుల పంపిణీని చోడవరం ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్ రాజు స్థానిక నాయకులతో కలిపి ప్రారంభించారు.

సబ్బవరం : మండల కేంద్రంలోని రేషన్ డిపోలో సరుకుల పంపిణీని జనసేన జిల్లా కార్యదర్శి గండి దుర్గాప్రసాద్, మండల టిడిపి కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కర్రి కనకరాజు, బర్ల రమణ,

మధురవాడలో...

బంతికోళ్ల పద్మ,పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలోని రేషన్‌డిపోను మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీ నరసింహమూర్తి ప్రారంభించి, రేషన్ సరుకులు పంపిణీ చేవారు. కార్యక్రమంలో డిటి రమేష్ బాబు, సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, ఎంపిటిసి బంగారి లక్ష్మి, పైలా అమ్మాజీ, పైలా గంగు నాయుడు, ఈర్లి రమేష్ పాల్గొన్నారు.

వడ్డాది : మండలంలోని వడ్డాదిలోస్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, బంగారుమెట్టలో ఎమ్మెల్యే రాజు రేషన్‌డిపోల వద్ద సరుకుల పంపిణీని ప్రారంభించారు. తహసీల్దార్ ఎం.లక్ష్మి, వడ్డాది, లోపూడి, ఎల్బిపురం సర్పంచ్‌లు కోరుకొండ కామలక్ష్మి, మేరుగు కుమారి,మొల్లి శ్రీను, తమరాన దాసు, ఎంపిటిసిలు ఎల్లపు జగ్గరావు, ఇంటి అప్పారావు, దొండా శ్రీను పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని పలు రేషన్ డిపోల్లో సరుకులు పంపిణీని కార్పొరేటర్ పిల్లా మగమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయుకులు పిల్లా వెంకటరావు, పిల్లా నరసింగరావు, మామిడి దుర్గరావు, పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డులో రేషన్ పంపిణీని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్, జనసేన ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ మహమ్మద్ నజీర్ పాల్గొన్నారు.

కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధిలోని చౌక ధరల దుకాణాల్లో రేషన్ పంపిణీని కార్పొరేటర్ మొల్లి హేమలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 91, 92 వార్డుల పరిధిలోని ఇందిరానగర్, పాత గోపాలపట్నం, నేతాజీ వీధిలో రేషన్ డిపోలను ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగా ప్రశాంతి, బాలసుబ్రహ్మణ్యం, నరిపిన్ని సత్తిరాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని 35వ వార్డు వెలంపేట అరటిపళ్ల సందులో ఉన్న డిపోలో రేషన్ సరుకుల పంపిణీని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఎపి ఎన్‌టిఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీలోపు చౌక ధరల దుకాణాల ద్వారా కార్డుదారులు రేషన్ సరుకులను పొందవచ్చని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. 18వ వార్డు అప్పుఘర్‌లోగల చౌక ధర దుకాణం నెంబర్ 0387201లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, కార్పొరేటర్ గొలగాని మంగవేణిలతో కలిసి ఆయన సరుకులను రేషన్ కార్డుదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఎస్‌ఓ వి.భాస్కరరావు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్లు

ఎంవిపి.కాలనీ:తొలి రోజు సర్వర్లు మొరాయించడంతో రేషన్ సరుకులు తీసుకునేందుకు వచ్చిన కార్డుదారులు ఇబ్బందులు పడ్డారు. చాలా సేపు క్యూలైన్లలో వేచి ఉన్నారు. సర్కిల్ – 2లోని కెఆర్‌ఎం కాలనీ ప్రాంతంలో ఉన్న 0387208 చౌక ధరల దుకాణంలో రాత్రి 7:30 గంటల సమయంలో సుమారు 50 మంది లబ్ధిదారులు రేషన్ తీసుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. దీనిపై రేషన్ డీలర్‌ను వివరణ అడగగా సర్వర్లు స్లోగా ఉన్నాయని తెలిపారు. ఉదయం నుండి 120 మందికి రేషన్ ఇచ్చామన్నారు. గతంతో ఒకటో తేదీన సుమారు 200 మందికిపైగా లబ్ధిదారులకు రేషన్ అందించేవారిమని తెలిపారు. ద్డాడ వెంకటరమణ , దొగ్గ దేముడు పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న డాక్టర్ గౌతమి

క్రీడా పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ మిని స్టేడియంలో క్రీడాకారులకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. బాక్సింగ్ గ్లౌస్, కరాటే పాడ్స్, టీషర్ట్ లు ఆదివారం నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణరావు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ గౌతమీ పాల్గొన్నారు. నర్సీపట్నంకు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుతాపల్లి శ్రావణ్, బంగారు నాయుడు ,వెలగ జగన్నాద్ , బాబీ మాస్టారు, బాక్సింగ్ ఆర్మీ కోచ్ యోగా నాయుడు, సీనియర్ కోచ్ శేఖర్ , ఉమెన్ కోచ్ ప్రియాంక, శాప్ కోచ్ అబ్బు పాల్గొన్నారు.



స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎర్రమనాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేటలో కామ్రేడ్ లగుడు ఎర్రమనాయుడు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు, కుటుంబ సభ్యులు ఎర్రమనాయుడు స్తూపం వద్ద ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామనాయుడు మాట్లాడుతూ, ఎర్రమనాయుడు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లగుడు వెంకటరమణ, నాయకులు మేకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయంలో భక్తుల సందడి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రేబాక గ్రామంలో గూడుపమ్మ తల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వంటలు తీసుకుని భోజనాలు చేశారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో సందడి చేసారు.

మాట్లాడుతున్న సిఐ గోవిందరావు

అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వైసీపీ టౌన్ ప్రెసిడెంట్, దళిత నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావుపై దాడి కేసులో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దాడి జరిగిన ఘటనపై ఏరియా ఆసుపత్రిలో ఈశ్వరరావు వద్ద నుంచి వాంగ్మూలం నమోదు చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ గొడవలో ఈశ్వరరావు పన్ను విరిగిందని తెలిపారు. అట్రాసిటీ కేసు నమోదు నేపథ్యంలో డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతుందన్నారు.

అన్నదాతలపై వడ్డీ భారం

- 6 శాతం నీటి తీరువా వసూలుకు డిమాండ్ నోటీసులు సిద్ధం



ప్రజాశక్తి-కోటవురట్ల: నీటి తీరువా పన్నులతో అన్నదాతల గుండెల్లో గుబులు నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో అడుగు పెడుతున్న తరుణంలో రెవెన్యూ అధికారులు నీటి తీరువా పన్నులు చెల్లించాలంటూ రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో రైతులకు నోటీసులు అందించేందుకు సన్నద్ధమవుతున్నారు. పాత బకాయిలతో పాటు ఆరు శాతం వడ్డీతో నీటి తీరువా పన్నులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టేందుకు జిల్లా స్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారులు సమావేశాలు ఇప్పటికే నిర్వహించారు.

మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన నీటి తీరువా ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల నుంచి కొంతమేర వడ్డీతో సహ వసూలు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మండల వ్యాప్తంగా నీటి తీరువా బకాయిలు 3.92 కోట్లకు సుమారు వసూళ్లకై డిమాండ్ నోటీసులు సిద్ధం చేశారు. ఇందులో అన్నవరం, జల్లూరు, సుంకపూరు, బాపిరాజు కొత్తపల్లి, పీకే పల్లి, పాములవాక బోడపాలెం, తంగేడు లింగాపురం, కైలాసపట్నం, కోటవురట్ల, చౌడువాడ, రాజుపేట, కొడవటిపూడి, రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా చెల్లించాల్సింది పాములవాక గ్రామం 2.17 కోట్ల సుమారు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో సుమారు లక్షల్లో చెల్లించాల్సిన వివరాలు..

కోటవురట్లలో సుమారు 31.85 లక్షలు, తంగేడు 13.20 లక్షలు, లింగాపురం8.98 లక్షలు, పీకే పల్లి 7.98 లక్షలు, సుంకాపూర్ 5.96 లక్షల, బికేపల్లి 5.72 లక్షలు, చౌడవాడ 4 లక్షలు, అన్నవరం3.49 లక్షలు, జల్లూరు 2 లక్షలు, రాజుపేట 1.84 లక్షలు, కొడవటిపూడి 1.27 లక్షలు, కైలాష్ పట్నం 58 వేల సుమారు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు పంచనా వేశారు. ఆ మేరకు డిమాండ్ నోటీసులు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

ఇదేనా సంపద సృష్టి ?

సంపద సృష్టి అంటూ బూటకపు కబుర్లు చెబుతున్న కూటమి ప్రభుత్వం రైతుల నడ్డి విరిగేలా చేస్తోంది.ఏళ్ళ తరబడి పేరుకుపోయిన బకాయిలను 6శాతం వడ్డీతో సహ నీటి తీరువా రైతుల నుండి వసూళ్ల చేసేందుకు సిద్ధమైంది.అసలే ఖరీఫ్ సీజన్ పెట్టుబడిల సమయం, అంతేకాకుండా గడిచిన రెండు ఏళ్లుగా రైతులకు చెల్లించాల్సిన రైతు భరోసా సైతం అందలేదు. కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి.

కిల్లాడ శ్రీనివాసరావు
వైసిపి మండల అధ్యక్షులు

చేతులు జోడించి వేడుకుంటున్న నాయకులు, గిరిజనులు

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: గొట్టువాడ శివారు అనుకు గిరిజన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఏం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం అణుకు గ్రామాన్ని సందర్శించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామంలో పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, గతంలో సిపిఎం నాయకులు చేసిన పోరాటం ఫలితంగా విద్యా వాలంటీర్ నియమించారన్నారు. వాలంటీర్ను తొలగించడంతో విద్యార్థులు విద్యకు దూరమవు తున్నారన్నారు. 45 రోజులు నిరాహార దీక్ష ఫలితంగా గ్రామానికి నిర్మించిన గ్రావెల్ రోడ్డు వర్షాలతో పలుచోట్ల కొట్టుకుపోయిందని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో అర్హులను గుర్తించి కాలనీ ఇల్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మామిడి నానాజీ, మర్రి సూరిబాబు, రఘు బాబు, సూరిబాబు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిపిఒ

మోదకొండమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

- డిపిఒ శిరీషా రాణి

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగులలో ఈనెల మూడో తేదీన జరిగే మోదకొండమ్మ అమ్మవారి జాతర మహొత్సవంకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డిపిఓ ఆర్. శిరీషా రాణి అధికారులకు ఆదేశించారు. ఆదివారం మాడుగల వచ్చిన ఆమె గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి వంటి విషయాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతర మహొత్సవం కు వచ్చే భక్తులకు తాగునీటి పూర్తిస్థాయిలో అందించడమే కాకుండా పారిశుధ్యం మెరుగనుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తో పాటు పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ రాజారాం, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు టిడిపి మండలాధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, ఆలయ కమిటీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

చెట్టుకు వేలాడుతున్న బ్రహ్మకమలం

విరబూసిన బ్రహ్మ కమలం

ప్రజాశక్తి - చింతపల్లి : మండల కేంద్రంలోని కొమ్మర్తి రాంబాబు గృహంలో బ్రహ్మ కమలం విరగబూసింది. సాధారణంగా ఒకటి, రెండు పూలతో బ్రహ్మ కమలం పుష్పాలు దర్శనం ఇచ్చేవి. అటువంటిది శని ఆదివారాలలో కోమర్తి రాంబాబు గృహం వద్ద ఏకంగా 30 నుంచి 40 బ్రహ్మ కమలాలు విరగబూయడం చూపరులను ఆకట్టుకుంటుంది.

కైలాసపట్నం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి కోటవురట్ల: మండలంలో అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ అక్రమ ఇసుక రవాణా కొనసాగుతూనే ఉంది, ఉచిత ఇసుక పేరుతో వరాహనదిలో ఇసుకను పరిమితికి మించి తరలించుకు పోవడంతో అధికారులు ఇసుక రవాణాను నిషేధించారు. కొంతమంది అక్రమార్కులు కైలాసపట్నం కేంద్రంగా ఇసుకను అక్రమంగా ఎడ్ల బండ్లు ద్వారా రవాణా చేసి ట్రాక్టర్ పై ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. ఒక్కోటైర్ బండి కి రూ.500 చొప్పున 3 టైరు బళ్ళు రూ.1500 చెల్లించి ఇతర ప్రాంతాల్లో 4 నుండి 5వేలు చొప్పున అమ్ముకుంటున్నట్లు సమాచారం. గడిచిన నాలుగు నెలలుగా ఇక్కడ నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా అటువైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుని ట్రాక్టర్ తో నిత్యం అక్రమ రవాణా సాగుతుంది. మరోవైపు సామాన్యులు ఇసుకను కొనుగోలు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతుంటే అక్రమ రవాణా దారులకు కాసుల వర్షం కురుస్తుంది. అధికారులు అక్రమ ఇసుక అరికట్టాలని వాల్టా చట్టాన్ని పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

బండ్లలో ఇసుక తరలింపు

పరామర్శిస్తున్న గణేష్

దాడి చేసిన వారిని శిక్షించాలి

-మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలో రౌడీ షీటర్లు రెచ్చిపోతున్నారని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. రౌడీ షీటర్ల చేతిలో గాయపడి వైద్యం పొందుతున్న వైసీపీ టౌన్ యూత్ దళిత నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావును ఏరియా ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే గణేష్ ఆదివారం పరామర్శించారు. గతంలో కర్రి శీను పై దాడిచేసి గాయపరిచిన రౌడీ షీటర్ అప్పలనాయుడు మళ్ళీ వైసిపి నాయకులు దళిత నాయకుడైన ఈశ్వరరావు పై దాడి చేశాడన్నారు. ఇటువంటి రౌడీ రాజకీయాలు మంచివి కావని తెలిపారు.దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ దాడి వెనుక కూటమి నేతల హస్తం ఉందని ఆరోపించారు. గాయపడ్డ దళిత నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ తనపై నలుగురు దాడి చేసి గాయపరిచారని భయంతో పరుగులు తీసి స్థానిక అంబేద్కర్ విగ్రహం వెనక దాక్కున్నప్పటికీ లాక్కొచ్చి దాడి చేశారని పోలీసుల సహకారంతో ఆసుపత్రికి చేరుకున్నానని తెలియజేశారు.

స్పెషల్ డిఎస్సి కోసం భిక్షాటన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ పిలుపు మేరకు అరకులోయ మండలం బస్కి పంచాయతీ కంజరితోట గ్రామంలో ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మెగా డీఎస్సీ పోస్టులను గిరిజన ప్రాంతంలో మినహాయించి గిరిజన స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుడిగా అరకు ప్రచార సభలో జివో నెం 3 స్థానంలో ప్రత్యేక జీవో తెచ్చి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఇచ్చిన హామీని ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో నిరుద్యోగ సమస్య పెరుగుతుండటంతో యువత చెడు మార్గంలో పయనిస్తూ గంజాయి వంటి డ్రగ్స్ వంటి చెడు దారులకు వెళ్ళి తమ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజన ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోతే మరింత నిరుద్యోగ సమస్య పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ ఉపాధ్యాయ, ఇతర ఉపాధి కల్పన విషయంలో గిరిజనులకే కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్కి పంచాయతీ గిరిజన సంఘం నాయకులు కె దేవన్న,కె సుబ్బారావు, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేపడుతున్న నేతలు, నిరుద్యోగులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1995-1996లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంతో పాఠశాల ఆవరణ సందడి వాతావరణం నెలకొంది.

మాడుగుల: మాడుగులలో పూర్వపు విద్యార్థులు ఆదివారం కలిశారు. 1998-2006 మధ్యలో మాడుగుల ఆర్.సి.యం పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు కలుసుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. ఏడాదికి ఒకసారి ఎలా కలుసుకోవడం ఎంతో శుభ పరిణామన్నారు. పలు ఆటలను నిర్వహించి ఎంతో ఉల్లాసంగా రోజంతా గడిపారు.

గొలుగొండలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాడుగులలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు